# పౌల్ట్రీ రైతులకు ప్రాపర్టీ ట్యాక్స్‌లో మినహాయింపు

### మంత్రి తుమ్మలకు ఎంఎల్‌ఎ శంకర్ వినతి



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పౌల్ట్రీ రైతులకు విధించిన ప్రాపర్టీ ట్యాక్స్‌లో మినహాయింపు ఇవ్వాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. షాద్‌నగర్ పౌల్ట్రీ రైతులకు పాత బకాయిల విషయంలో స్థానిక మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారని, ఆ ఆదేశాలను రద్దు చేయాలని మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంఎల్‌ఎ తెలిపారు.



# లోక్ అదాలత్‌పై పోలీసులు దృష్టి కేంద్రీకరించండి

### లీగల్ సెల్ సర్వీసెస్ జిల్లా సెక్రటరీ పి.శ్రీదేవి

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** లోక్ అదాలత్‌పై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని జిల్లా లీగల్‌సెల్ సర్వీసెస్ సెక్రటరీ పి.శ్రీదేవి అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ కోర్టు సముదాయంలో పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పి.శ్రీదేవి మాట్లాడుతూ వచ్చే నెల జూన్1వ తేది నుండి 8వ తేది వరకు లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసులను పరిష్కరించుకునే విధంగా కక్షదారులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, వారికి సహకరించి కేసులను త్వరిత గతిన పూర్తి చేసే విధంగా సహాయపడాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్‌కుమార్, షాద్‌నగర్ డివిజన్ పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## దత్త పుత్రికను తండ్రికి అప్పగించండి : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దత్తత తీసుకున్న బాలికను చట్టవిరుద్ధంగా తీసుకెళ్లడం చెల్లదని శిశు సంక్షేమ కమిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు హైకోర్టు తేల్చి చెప్పింది. బాలికను తక్షణం తండ్రికి అప్పగించాలని గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తన రెండున్నరేళ్ల దత్త పుత్రికను బలవంతంగా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు తీసుకువెళ్లారంటూ మలక్‌పేటకు చెందిన అరుణ్ కుమార్ గుప్త, బాలిక తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తులు జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ జె. శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. బాలికను 2021 జులై 27న చట్టప్రకారం అరుణ్‌కుమార్ దత్తత తీసుకుంటే, శిశు సంక్షేమశాఖకు అధికారులు ఇద్దరు వచ్చి తాము బాల రక్షకులమని చెప్పుకుని ఇద్దరు కానిస్టేబుళ్ల సాయంతో ఇంట్లోకి చొరబడి బాలికను తీసుకువెళ్లిపోయారని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. చట్ట వ్యతిరేకంగా బాలికను తీసుకువెళ్లారని, తిరిగి బాలికను అప్పగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, పరిహారంగా రూ.10 లక్షలు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ వద్ద అనధికారికంగా బాలిక ఉందన్న ఫిర్యాదు మేరకు శిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధీనంలోకి తీసుకున్నారని ప్రభుత్వ న్యాయవాది ప్రతివాదనలో చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, అధికారులు చెబుతున్న నిబంధనల ప్రకారం సంరక్షుకులు అసమర్థులని భావించినప్పుడు బాలికను వారి సంరక్షణలోకి తీసుకోవచ్చునని, అయితే అసమర్థులని నిరూపణకు ఆధారాలు ల్లేవని చెప్పింది. పిటిషనర్‌పై చర్యలు తీసుకునేందుకు ఈ ఉత్తర్వులు అధికారులకు అడ్డంకి కాబోదని చెప్పింది. అధికారుల నుంచి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలనే వ్యవహారంలోకి తాము వెళ్లడం లేదని, బాలిక స్వేచ్ఛ వరకే పరిమితమైనట్లు ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. పరిమారం కావాలని పిటిషనర్ భావిస్తే చట్ట ప్రకారం సివిల్ కోర్టులో తేల్చుకోవచ్చునని చెప్పింది. పిటిషన్‌పై విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

## ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం.. స్టేకు హైకోర్టు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై స్టే జారీకి హైకోర్టు నిరాకరించింది. అవిశ్వాస తీర్మానం వ్యవహారంపై సమావేశం నిర్వహించవచ్చని స్పష్టం చేసింది. అయితే, ఫలితాలను ప్రకటించరాదని షరతు విధించింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికిగాను ఏప్రిల్ 27న కలెక్టర్ ఇచ్చిన నోటీసును ఎల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ కుడుముల సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిని జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి బుధవారం విచారించారు. అవిశ్వాస తీర్మానం అమలు తర్వాత ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందని, అందువల్ల అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. ప్రభుత్వ న్యాయవాది బి.మోహనారెడ్డి ప్రతివాదన చేస్తూ, అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ చేతులు ఎత్తే విధానంలో జరుగుతుందన్నారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, స్టేకు నిరాకరించింది. కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది

## స్థల వివాదంపై హైకోర్టుకు జూనియర్ ఎన్టీఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో 2007లో స్థలం కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టిన ఇంటిపై బ్యాంకులకు హక్కులు ఉన్నాయని డీఆర్‌టీ (రుణ వసూళ్ల ట్రైబ్యునల్) ఇచ్చిన తీర్పును సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ హైకోర్టులో సవాల్ చేశారు. బ్యాంకులకు అనుకూలంగా ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలంటూ జూనియర్ ఎన్టీఆర్ తరపున జీపీఏ హోల్డర్ కె రాజేశ్వరరావు పిటిషన్ వేశారు. దీనిని గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజయ్ పాల్,హౌ జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో 881 చదరపు గజాల స్థలాన్ని సుంకు గీత అనే మహిళ నుంచి 2007లో జూనియర్ ఎన్టీఆర్ కొనుగోలు చేసి చట్ట ప్రకారం అన్ని అనుమతులు పొందాక ఇంటి నిర్మాణం చేపట్టారని తెలిపారు 1996లోనే ఈ స్థలాన్ని తనఖా పెట్టి ఇంటి జాగాపై రుణం పొందారని, రుణం చెల్లించని కారణంగా ఆ ఆస్తిపై హక్కులు తమవేనని పేర్కొంటూ ఎస్‌బీఐ, ఓబీసీ, ఇండస్, బ్యాంక్ ఆఫ్ బరోడాలు నోటీసులు ఇచ్చాయని చెప్పారు.ఈ నోటీసులను సవాలు చేస్తూ పిటిషనర్ డీఆర్‌టీని ఆశ్రయించారని, దీనిపై సమగ్ర వివరాలు పరిశీలన చేయకుండానే డీఆర్‌టీ ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్థలాన్ని అమ్మిన వారిపై కేసు పెట్టినట్లు తెలిపారు. అయితే డీఆర్జే డాకెట్ ఆదేశాలు అందాల్సివుందని, కొంత సమయం ఇస్తే వాటి వివరాలు సమర్పిస్తామని చెప్పారు. వచ్చే వారానికి వివరాలు ఇస్తామన్నారు. దీనిపై విచారణను వచ్చే వారానికి వాయిదాకు హైకోర్టు నిరాకరించింది. జూన్ 3లోగా డీఆర్జే డాకెట్ ఉత్తర్వులను సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను జూన్ 6కు వాయిదా వేసింది.

## భూ కేటాయింపు చట్టబద్ధమే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆనంద్ సినీ సర్వీసెస్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ మాజీ మంత్రి టీ.హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేసింది. సినిమా పరిశ్రమను ప్రోత్సహించే క్రమంలో భాగంగానే ఆనంద్ సినీ సర్వీసెస్‌కు భూ కేటాయింపు జరిగిందని చెప్పింది. 2008లో జీవో 355 జారీచేయడాన్ని సవాల్ చేస్తూ హరీష్‌రావు వేసిన వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది. గతంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి భూకేటాయింపులు జరిగాయని తీర్పులో గుర్తుచేసింది.

## పోలింగ్‌పై ఫేక్ వీడియోను వైరల్ చేసిన నలుగురి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న తీరుపై ఫేక్ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేసిన నలుగురు యువకులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సైబర్ క్రైమ్ డిసిపి డి.కవిత శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒకే వ్యక్తి చాలాసార్లు ఓటు వేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని బహదూర్‌పురా పోలింగ్ స్టేషన్‌లో చోటుచేకుంది. అయితే ఆరోపించిన వీడియో 2022లో జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల సమయంలో రికార్డ్ చేయబడిన పాత వీడియో. ఈ వీడియో ఇటీవల వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వైరల్ కావడంతో సంచలనం రేపింది. కొంత మంది వ్యక్తులు పశ్చిమ బెంగాల్ ఎన్నికలకు సంబంధించిన పాత వీడియోను షేర్ చేస్తున్నారు. హైదరాబాద్ పాతబస్తీలో రిగ్గింగ్ జరిగినట్లు నకిలీ సమాచారాన్ని ప్రసారం చేస్తున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు రావడంతో సైబర్‌క్రైం పోలీసులు క్రైమ్ నెంబర్ 1156/2024 కింద కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో మల్కాజ్‌గిరికి చెందిన వి.శ్రీనివాస్, నాంపల్లికి చెందిన మహ్మద్ బిన్ అలీ, ఛాదర్‌ఘాట్‌కు చెందిన కాశీ, చిక్కడపల్లికి చెందిన మితిలేష్‌లు ఈ విడియో వైరల్ చేసినట్లుగా తేలింది. దీంతో ఈ నలుగురిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# పుస్తకాలు, దుస్తులు అందజేసేందుకు చర్యలు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పాఠశాలల పునః ప్రారంభమయ్యే నాటికి పుస్తకాలు, దుస్తులు అందజేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, బడులు పునః ప్రారంభం అయ్యే నాటికి పనులన్నీ పూర్తి కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ యూనిఫామ్‌లు అందించడంపై జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ జిల్లాలో రూరల్ ప్రాంతాలలోని పాఠశాలల విద్యార్థులకు 82 వేల 306 యూనిఫామ్‌లు , యుఎల్‌బి పరిధిలోని ప్రాంతాలలోని పాఠశాలల విద్యార్థులకు 47 వేల 722యూనిఫామ్‌లు , జిహెచ్ఎంసి పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు 50 వేల 131 యూనిఫామ్‌లు , మొత్తం ఒక లక్ష 80 వేల 159 యూనిఫామ్‌లను కుట్టించి సకాలంలో అందించేందుకు అవసరమైన టైలర్ లను గుర్తించడం జరిగిందని వివరించారు. వారు యూనిఫామ్‌లు పాఠశాలలు పునః



ప్రారంభం నాటికి తయారు చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్ రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, డిసిసిఒ ధాత్రి దేవి, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ విజయలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### వెబ్ క్యాస్టింగ్, స్క్రీనింగ్ స్ట్రాంగ్ రూంల పరిశీలన







వెబ్ క్యాస్టింగ్, స్క్రీనింగ్ ద్వారా స్ట్రాంగ్ రూంలను రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సిఇఒ లోకేష్ కుమార్ పరిశీలించారు. శుక్రవారం చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పోల్డ్ ఇవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను వెబ్ క్యాస్టింగ్, స్క్రీనింగ్ ద్వారా చేవెళ్ల పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ కె.శశాంకతో కలిసి అడిషనల్ సిఇఒ లోకేష్ కుమార్ పరిశీలించారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్ ముగిసిన అనంతరం మహేశ్వరం, రాజేందర్ నగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటింగ్ యంత్రాలను బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో భద్రపర్చగా, ఆవరణలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా అడిషనల్ సిఇఒ లోకేష్ కుమార్ ఒక్కో స్ట్రాంగ్ రూంను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా వాటికి వేసిన సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలు, వాటి పరిసరాలలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను గమనించారు. నిరంతరం నిఘా కోసం అమర్చిన క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరు, వాటి ద్వారా కొనసాగిస్తున్న పర్యవేక్షణను పరిశీలించి, సంబందింత అధికారులకు పలు సూచనలు చేశారు. అడిషనల్ సిఇఒ వెంట రిటర్నింగ్ అధికారి అండ్ కలెక్టర్ శశాంకతోపాటు, చేవెళ్ల, రాజేందర్‌నగర్ ఆర్‌డిఒ, ఎఆర్‌ఒలు సాయిరామ్, వెంకట్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విజయపురి కాలనీలో సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్లోని విజయపురి కాలనీ ఫేస్1లో శ్రీశిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన 22వ వార్షికోత్సవ ఉత్సవాలను కాలనీ వాసులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై ప్రేత్యక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ఆలయ కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, ఆలయచైర్మన్ పర్వతరెడ్డి, పిఆర్‌ఓ సాయిరాం, కనకరాజు, రమణ, శ్రీనివాస రావు, అనిరుద్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్, శశిహరి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# హైటెక్స్‌లో ఐజిబిసి గ్రీన్ ప్రాపర్టీషో ప్రారంభం

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఐజిబిసి గ్రీన్ ఇండియా ప్రాపర్టీ షో రెండవ ఎడిషన్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల ప్రదర్శనను తెలంగాణ పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇరిగేషన్, ఫుడ్ అండ్ సివిల్ సప్లెయిస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి ) నేషనల్ వైస్ చైర్మన్ సి. శేఖర్‌రెడ్డి, ఐజిబిసి హైదరాబాద్ చాప్టర్ కో చైర్మన్ శ్రీనివాస్ మూర్తిలతో కలిసి ప్రారంభించారు. దేశంలో హరిత భవనాలపై మరింత అవగాహన పెరగడానికి ఇలాంటి కృషి మరింత జరగాలని మంత్రి ఉత్తమ్ కుమార్ కుమార్ రెడ్డి అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి ప్లాటినమ్ గ్రీన్ బిల్డింగ్ అయిన ఐజిబిసి ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉందని తెలిసి తాను సంతోషిస్తున్నాన్నారు. గ్రీన్ బిల్డింగ్ పద్ధతులను ప్రోత్సహించడంలో పర్యావరణ అనుకూల గృహ ఎంపికలను ప్రదర్శించడంలో వారి ప్రయత్నాల కోసం ఐజిబిసినాయకత్వాన్ని దాని వాటాదారులను తాను అభినందిస్తున్నాను. మరీ ముఖ్యంగా ఈ ఎగ్జిబిషన్



కొనుగోలుదారులు, అమ్మకందారులకు మంచి అవకాశాలను కల్పిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈనెల 17,18,19 తేదీల్లో జరగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో నివాస ప్రాజెక్టులను సందర్శనకు ఉంచారు. ఐజిబిసి నేషనల్ వైస్ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రీన్ బిల్డింగ్‌లతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. దేశంలో గ్రీన్ బిల్డింగ్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రయత్నాలను మరింత ముందుకు తీసకువెళ్తామని తెలిపారు.

# ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

### జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిని నీరజగాంధీ

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాతలు అయిల్‌పామ్‌పై దృష్టి కేంద్రీకరించి అధిక లాభాలు పొందేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిని నీరజగాంధీ సూచించారు. శుక్రవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలోని రైతు వేదికలో అయిల్‌పామ్ పంటల సాగుపై అన్నదాతలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అన్నదాతలు నూతన పద్దతులు పాటించాలని, ప్రధానంగా రైతులు అయిల్ ఫామ్ పంట సాగుపై దృష్టి పెట్టి ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అయిల్ ఫామ్ పంట సాగుకు మొక్కులపైన, డ్రిప్ ఇరిగేషన్‌కు, పంటల నిర్వాహణ కోసం ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఫామ్ అయిల్ పంట ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుందని, చీడ పీడల బెడద అనేది తక్కువగా ఉంటుందని వివరించారు. ఒక ఎకరాకు 8నుండి 12టన్నుల దిగుబడి వస్తుందని, దీంతో అన్నదాతలకు ఎకరాలనికి నికరంగా లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. పామాయిల్ పంటలో మూడు ఏళ్ల వరకు అన్ని రకాల అంతర పంటలను సాగు చేసుకోవచ్చునని, మొక్కజొన్న, కంది, పత్తి, అరటి, బొప్పాయి పంటలను సాగు చేసుకొవచ్చునని సూచించారు. అయిల్ ఫామ్ పంట ప్రధానంగా మూడున్నర ఏళ్ల తరువాత



ప్రారంభమై 30ఏళ్ల వరకు నిరంతరంగా పంట దిగుబడి వస్తుందని వివరించారు. నీటి వసతి ఉన్న అన్నదాలు ఈ పంటను సాగు చేసుకునేందుకు ముందుకు రావాలని పేర్కొన్నారు. వాల్యూ ఆయిల్ గ్యాస్ సర్వీసెస్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహనరావు మాట్లాడుతూ అయిల్ ఫామ్ రైతులను కంపెనీ అన్ని విధాల అదుకునేందుకు కృషి చేస్తుందని వివరించారు. మండలానికి ఒక ఫీల్డ్ ఆఫీసర్ నియమించడం జరిగిందని, వారి ద్వారా నిరంతరం పంట పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు క్షేత్ర సందర్శనల ద్వారా అవగాహన కల్పిస్తామని, పత్తి, మొక్కజొన్న కూరగాయలు, చిరుధాన్యాలు పండించి అధిక లాభాలు పొందాలని వివరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ వ్యవసాయ శాఖ ఏడిఏ రాజారత్నం, డివిజన్ ఉద్యానవన శాఖ అధికారిని ఉషారాణి, వెల్‌జర్ల క్లస్టర్ ఏఈఓ రమణరావు, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ అఫీసర్ మల్లారెడ్డితోపాటు రైతులు పాల్గొన్నారు.

## నేడు నార్సింగి మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

**ప్రజాపక్షం/నార్సింగి:** రాజేంద్రనగర్ ఆర్‌డిఒ సమక్షంలో నార్సింగి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం శనివారం ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నార్సింగి మున్సిపాలిటీలో మొత్తం 18మంది కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేస్తూ 12 మంది జిల్లా కలెక్టర్‌కు లేఖ అందించారు. ఈ నేపథ్యంలో అధికారులు అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. నార్సింగి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్ బిఆర్‌ఎస్ పార్టీకికి చెందిన వారు ఉన్నారు

**గోవాలో క్యాంపు...** అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన 12 మంది కౌన్సిలర్లు గోవాలో క్యాంపు వేశారు. వారు నేరుగా సమావేశానికి శనివారం రానున్నారు. మొత్తం మున్సిపాలిటీలో 18 మంది కౌన్సిలర్లు ఉండగా కాంగ్రెస్ పార్టీకి 13 మంది ఉన్నారు. అవిశ్వాస తీర్మానంపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ధీమాగా ఉన్నారు. ఇప్పటికే ఆ పార్టీకి 13 మంది కౌన్సిలర్లు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్ కుర్చీలను దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుంది. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కౌన్సిలర్లతోపాటు వివిధ రాజకీయ పక్షాల నేతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అవిశ్వాస సమావేశాన్ని పక్కాగా నిర్వహించేందుకు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

## కార్తీక్‌రెడ్డి రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించిన కెసిఆర్

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** భారతదేశ ఎన్నికలపై బిఆర్‌ఎస్ యువ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి రాసిన "హౌ టూ బయ్ ఆన్ ఇండియన్ ఎలక్షన్" పుస్తకాన్ని బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారతదేశంలో సమగ్ర ఎన్నికల ప్రక్రియలో పార్టీల పాత్ర, ఓటర్లు, తదితర అంశాలతో ఈ పుస్తకం రాశారు. గతంలో ఎన్నికలకు, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలకు తేడాలు, వర్తమాన రాజకీయ అంశాలు, ఎన్నికలను ఎదుర్కోవడం ఎలా, సవాళ్లు లాంటి అన్ని అంశాలు ఈ పుస్తకంలో పొందుపర్చారు. బిఆర్‌ఎస్ యువ నేతగా రాజకీయాల్లోకి వచ్చి, గతంలో చేవెళ్ల పార్లమెంట్‌కు పోటీ చేసిన పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి బిఆర్‌ఎస్‌లో చురుకుగా పనిచేస్తూ పార్టీ తరుపున అధికారికంగా జాతీయ మీడియాలో మాట్లాడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, హిందీ, భాషల్లో పట్టున్న కార్తీక్ రెడ్డి జాతీయ మీడియాలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఇంగ్లీష్ లో రాసిన ఈ పుస్తకంతో మరోసారి వార్తల్లో నిలిచారు.

# పదేళ్ల పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

### షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో నెలకొన్న మురుగునీటి కాలువల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి కేంద్రీకరించకుండా మురుగు కాలువలపై రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. గ్రామంలో పూర్తి స్థాయిలో మురుగు కాలువలను పూర్తి చేసేందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు తాను సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. విమర్శలను తాను ఎన్నడు పట్టించుకోనని, కేవలం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలతో కలిసి సమస్యలను



అడిగి తెలుసుకున్నారు. తామేమైనా మోరీలు తీయొద్దన్నామా..శుభ్రం చేయొద్దాన్నామా ప్రశ్నించారు. లింగారెడ్డిగూడ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానని వివరించారు. కార్యక్రమంలో చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్, రమేష్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, గణేష్ యాదవ్, మల్లేష్‌గౌడ్, ధనుంజయగౌడ్ పాల్గొన్నారు.

# అక్రమంగా దేవాదాయ భూముల రిజిస్ట్రేషన్

### రాష్ట్ర కమిషనర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కోట్లు విలువ చేసే దేవాదాయ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ విషయం వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులోని శ్రీ అంబా భవాని మాత దేవాలయానికి చెందిన భూములను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయంపై స్థానిక ఎంపిటిసి కావలి శ్రీశైలం, ఆర్ల యాదయ్య యాదవ్, నారం రాంరెడ్డి, రాజు, లక్ష్మయ్య, సంజీవ్ యాదవ్, కృష్ణయ్య యాదవ్‌లు దేవాదాయ ధర్మాదాయ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీఅంబా భవాని మాత దేవాలయం పేరుపై సర్వే నంబర్ 441లో 3.28ఎకరాల పొలం ఉంది. ఈ పొలం విలువ సుమారు రూ.15కోట్లకు సైగా ఉంటుందని,ఈ భూమిని దేవాదాయ శాఖ తమ రిజిస్టర్ 43లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ భూమిని ఎలాగైనా కాజేయాలనే లక్ష్యంతో కొందరు అనుభవదారులమంటూ 2015లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ నంబర్ 2031/2015 డాక్యుమెంట్ ఫరూఖ్‌నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తుమ్మలపల్లి గుల్లె కృష్ణయ్య పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్



చేసుకున్నారని ఫిర్యాదులో తెలిపారు. కొనుగోలు చేసిన సదరు వ్యక్తి తిగిరి ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తుండటంలో అసలు విషయం బయటకు వచ్చిందని తెలిపారు. శ్రీ భవాని మాత దేవాలయానికి సంబంధించిన భూములను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినా..కొనుగోలు చేసినా వారిపై అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విచారణ చేయాల్సి వస్తుందని, నిజ నిజాలను బయటకు తీయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దేవాలయ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై దేవాదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంతోపాటు దేవాలయ భూములను కాపాడేందుకు కృషి చేయాలని వారు కోరారు.

## నర్సరీలు ఎండిపోకుండా చర్యలు

### ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించామన్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను తప్పులు లేకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయన్నారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను త్వరలో పూర్తిచేయాలన్నారు. గ్రామంలో పర్యటించి సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీని పరిశీలించారు. త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. మేన్‌వాల్సును కూల్చి వేయడం సరైది కాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## గోతులు తవ్వారు..పనులు మరిచారు!

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు సంచరించే రహదారిపై గోతులు తవ్వి పనులు పూర్తి చేయక పోవటాన్ని నిరసిస్తూ మౌలాలి డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ ప్రాంతవాసులు శుక్రవారం కాలనీ మెయిన్ రోడ్‌పై బైఠాయించి ధర్నా చేసారు. వారు మాట్లాడుతూ ఆరు మాసాల క్రితం జిహెచ్‌ఎంసి అధికారుల సమక్షంలో కంట్రాక్టర్లు మరమ్మత్తుల పేరిట రహదారిపై గోతులు తవ్వారు. ఆ తర్వాత సంబంధిత కంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండా అర్థాంతరంగా వదిలి వెళ్లారు. వాహనాలపై ఈ మార్గంలో వెళ్లే ప్రజలు ప్రమాదాలకు గురైన ఉదంతాలు చోటు చేసుకొన్నాయన్నారు. పలు సార్లు జిహెచ్‌ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. ఈ విషయమై స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యేలు రహదారి మరమ్మత్తు పనులను పూర్తి చేయాలని కోరారు.

## గుర్రపు డెక్క తొలగింపునకు వినతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు కమిషనర్ వినతి పత్రం అందజేశారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు పరిధిలోని దాయరకుంట చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో పరిసరా కాలనీలైన దత్తాత్రేయ కాలనీ, శివశక్తి కాలనీ, బిఎంఆర్ కాలనీ, గోపికృష్ణ కాలనీ, అరవిందకాలనీ, మణి ఎన్‌క్లేవ్, 18,19,20 వార్డుల కాలనీవాసులు దోమలతో రోగాలతో ప్రమాదకంగా మారిందని,గుర్రపు డెక్క ఆకును తొలగించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పంగ హరిబాబు,అన్నంరాజు సురేష్,సుర్వీ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గెలిస్తే అమేథీ, రాయ్‌బరేలీలోనూ సమాన అభివృద్ధి : రాహుల్

**అమేథీ :** అభివృద్ధి పనులు చేసే విషయంలో అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాలు రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తామని కాంగ్రెస్‌పార్టీ పూర్వాధ్యక్షుడు రాహుల్‌గాంధీ శుక్రవారం అమేథీలో జరిగిన ఎన్నికల ర్యాలీలో స్పష్టం చేశారు. ఈసారి కాంగ్రెస్‌పార్టీ తరపున అమేథీ అభ్యర్థిగా కిషోరీలాల్ శర్మను నిలబెట్టారు. ''రాయ్‌బరేలీలో గనుక అభివృద్ధికోసం పది రూపాయలు ఖర్చు పెడితే అమేథీలో కూడా అంతే డబ్బు అభివృద్ధి కోసం కేంద్రంలోని తమ ప్రభుత్వం ఖర్చు పెడుతుంది, ఇది నేను చేస్తున్న వాగ్దానం'' అని రాహుల్‌గాంధీ అమేథీ నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇచ్చారు. గడచిన 40 సంవత్సరాలుగా చాలా నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్నందుకుగాను కిషోరీలాల్ శర్మకు ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ కృతజ్ఞతలు తెలియజేశారు.అమేథీ నుండి మూడు సార్లు పార్లమెంటు సభ్యగా గెలిచిన రాహుల్



గాంధీని 2019 ఎన్నికల్లో కేంద్రమంత్రి స్మృతి ఇరానీఓడించి ఆ నియోజకవర్గాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఐతే కేరళలోని వాయినాడ్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాహుల్‌గాంధీ ఈసారి అమేథీ నుండి పోటీ చేయకుండా దాని పొరుగున రాయ్‌బరేలీ నుండి పోటీ చేస్తున్నారు. సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ మద్దతుతో అమేథీ నుండి కిషోరీ లాల్ శర్మ కాంగ్రెస్ తరపున పోటీ చేస్తూ ఉండటంతో ఆ పార్టీతో కలిసి నిర్వహించిన సం యుక్తర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. సోనియాగాంధీ ప్రత్యక్షపోటీని వదిలి రాజ్యసభకు మళ్ళడంతో చివరి నిమిషం వరకూ కొనసాగిన సస్పెన్స్‌కు తెరదించి రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీ బరిలోకి దిగారు.

## మనదేశ పరిస్థితులూ రష్యాలోలానే ఉన్నాయ్ : కేజ్రీవాల్

**అమృత్‌సర్ :** మనదేశంలో పరిస్థితులు కూడా రష్యాలో ఉన్నట్టే ఉన్నాయని ఆమ్ ఆద్మీపార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. పంజాబ్‌లో శుక్రవారం పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన ఒక సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, రష్యాలో నియంతృత్వపాలన నడుస్తోందనీ, ప్రతిపక్షాల నాయకులు జైలులో ఉన్నారనీ, అసలు ఆ దేశంలో ప్రతిపక్షం అనేదే లేకుండా పోయిందనీ అన్నారు. మనదేశంలో పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం తన ప్రత్యర్థి పార్టీల నాయకులు అందరినీ జైళ్ళకు పంపిందని విమర్శించారు. ''దేశంలో నడుస్తున్న నియంతృత్వం ఎంతమాత్రం సమర్థనీయం కాదు, దీనిని అంగీకరించకూడదు, భారతదేశం గడచిన 75 సంవత్సరాలకాలంలో ఏనాడూ ఇలాంటి పరిస్థితులను చూడలేదు, ప్రతిపక్షాలను ఈ విధంగా జైళ్ళలోకి నెట్టలేదు అని కేజ్రీవాల్ అన్నారు. ''రష్యాలో వ్లదిమీర్ పుతిన్ ప్రతిపక్షాలను జైళ్ళలో కుక్కడమో లేక వారిని హతమార్చడమో చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహించి 87 శాతం మెజారిటీ సాధించారు, ప్రతిపక్షమే గనుక లేకపోతే మీరు కూడా ఏకైక నాయకుడుగా ఓట్లన్నీ సంపాదించుకోవచ్చు'' అని కేజ్రీవాల్ మోదీ ఉద్దేశించి విమర్శలు చేశారు. కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంకోసం బెయలు మంజూరు చేసింది. ఎన్నికల ప్రచారం పూర్తికాగానే ఆయన తిరిగి జూన్ రెండవ తేదీన తీహార్ జైలుకు వెళ్ళవలసి ఉంటుంది. మే 10వ తేదీన సుప్రీంకోర్టు ఆయనకు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు అనుమతిఇచ్చింది. ''వాళ్ళు (బిజెపి) నన్ను జైలులో పెట్టారు, అంతకుముందు ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను జైల్లో పెట్టారు, కాంగ్రెస్‌పార్టీ బ్యాంకు అకౌంట్లను స్తంభింపజేశారు, టిఎంసిపార్టీకి సమస్యలు సృష్టించారు,

## కిడ్నాప్ కాదది..అరెస్టే

### మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ అరెస్టు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** డివిజన్ కార్యాలయం నుండి గురువారం సాయంత్రం ఆగంతకులు తీసుకొని వెళ్లిన బిజెపికి చెందిన మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్‌ను సైబర్ నేరానికి సంబంధించి తామే అరెస్టు చేసామని హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధికి చెందిన సిసిఎస్ పోలీసులు స్పష్టం చేసా రు. శుక్రవారం కార్పొరేటర్‌ను న్యాయస్థానంలో హాజరు పరచిన అనంతరం న్యాయమూర్తి ఆదేశాల చంచల్‌గూడ్ కారాగారానికి రిమాండ్‌కు తరలించారు. ఇటీవలి ఎన్నికల్లో బహదూర్‌పురా ప్రాంతంలో రిగ్గింగ్ జరుగుతోందంటూ వీడియోను వైరల్ చేరారన్న ఆరోపణలపై నమోదైన సైబర్ నేరంపై సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసారు. శుక్రవారం కార్పొరేటర్ కార్యాలయం నుండి సాధారణదుస్తులతోవచ్చిన ఆగంతకులు లోపలికి ప్రవేశించి రెండు కార్లలో తీసుకొని వెళ్లటంపై ఎవరైనా దుండగులు కిడ్నాప్ చేసి తీసుకొని వెళ్లారా లేక పోలీసులు తీసుకొని వెళ్లారా అన్నఆందోళనకుగురై ఆయన తండ్రి రాంబాబు మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసారు.

**న్యాయ పరంగా ఎదుర్కొంటాం**

అక్రమకేసులతో కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్‌పై అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేయటాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటామని మల్కాజిగిరి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన నాంపల్లి న్యాయస్థానం వద్ద బిజెపికి చెందిన మురళి గౌడ్, ప్రసన్న కుమారి తదితరులతో కల్సి ఉన్నారు.

## ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో చదవుతున్న ఎస్సీ విద్యార్థినీ విద్యార్థుల కొరకు 2024/25 విద్యా సంవత్సరమునకు బెస్ట్ అవేలుబల్ పథకం క్రింద ఇంగ్లీష్ మీడియం 1వ తరగతి డేస్కాలర్ 5వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల నుండి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలో 88 సీట్లు 1వ తరగతి , 5వ తరగతి 91 సీట్లు రెసిడెన్సియల్ లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏప్రిల్ 1 2024 నాటికి తల్లిదండ్రుల వార్షిక ఆదాయము లక్షా50వేలు రూపాయల లోపు గ్రామీణ ప్రాంతములతో నివసించే వారికి అదేవిధంగా పట్టణ ప్రాంతములలో 2లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగి ఉండలనికలెక్టర్ పేర్కొన్నారు. కుల అదాయం ,రేషన్‌కార్డు .జనన దృవీకరణ పత్రములు ఆధార్‌కార్డు, 2పాస్ పోర్టు సైజు పోటలతో కార్యాలయ పని దినాలలో జిల్లా కలెక్టర్ ఆవరణలోని షెడ్యుల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలన్నారు. 1వ తరగతి యందు జున్ 1,2018 నుండి మే 31 2019మధ్యలో జన్మించిన వరు మత్రమే అర్హులు అని తెలిపారు. పూర్తి వివరాల కొరకు 9908690240 నెంబర్‌ను సంప్ర



దించాల్సిందిగాకలెక్టర్‌సూచించారు.

**మే30లోగా సదుపాయాలు కల్పించండి**

వికారాబాద్ మున్సిపాల్ పరిధిలోని కొంపల్లి ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా సందర్శించి జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 30లోగా అన్ని మౌలికసదుపాయాలు కల్పించాలని అధికారులు అదేశించారు. జున్ మాసంలో పాఠశాలలో తెరుచుకునేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. చేపడుతున్న పన్నుల్లో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా జరగాలని తెలిపారు.

# బోడుప్పల్ కార్పొరేషన్‌పై సర్వత్రా చర్చలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటి మేయర్‌లపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 21 మంది కార్పొరేటర్లు కల్సి శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసులు అందించారు. ఇటీవల చోటు చేసుకొంటున్న రాజకీయ సమీకరణాలతో కార్పొరేషన్‌లో బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన 21 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వారంతా కల్సి బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన మేయర్ శ్యామల బుచ్చిరెడ్డి, డిప్యూటి మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టి బిఆర్‌ఎస్ అధీనంలో ఉన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకొనేందుకు పావులు కదుపుతున్నారు. మాజీ శాసనసభ్యుడు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు తదితర పార్టీ నేతలు అవిశ్వాసన తీర్మాన నోటీసును అదిషన్ కలెక్టర్ అందచేసిన సమయంలో కార్పొరేటర్ల వెంట



ఉన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం ఈ కార్పొరేషన్‌లో 6వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న తోటకూర వజ్రేష్ యాదవ్ కుమారుడైన తోటకూర అజయ్ యాదవ్‌ను మేయర్‌గా చేసేందుకు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**కాంగ్రెస్‌లో చేరిన 28వ డివిజన్ కార్పొరేటర్**

ఇదిలా ఉండగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిఆర్‌ఎస్‌కు చెందిన 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నరసింహ శుక్రవారం కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పుకొన్న అనంతరం నరసింహ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో ఆకర్షితుడినై బోడుప్పల్ ప్రాంత ప్రగతి కోసమే పార్టీలో చేరానని, తనతో పాటు కొద్ది రోజుల్లో మరి కొంత మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారని తెలిపారు.

## నేడు వేంకటేశ్వరుని కల్యాణోత్సవం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని శ్రీ బాలాజి వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని నేడు (శనివారం) నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటి నిర్వాహకులు తెలిపారు. ప్రతియేటా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ప్రభాత సేవా, గణపతి పూజ, పుణ్యహవాచనం, ద్వజారోహనం, అగ్ని ప్రతిష్ట, స్వామి వారికి పంచామృతాభిషేకం, అలివేలు మంగ పద్మావతి సమేతంగా శ్రీ బాలాజి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. మరుసటి రోజు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, నిత్య పూజలు నిర్వహిస్తారు. పొన్నసేవా, గరుడ సేవా, హోమములు, మహాపూర్ణాహుతి, మొక్కు సేవలు, రథోత్సవం, చక్రస్నానంతో కార్యక్రమాలు ముగిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఉత్సవ కమిటి సభ్యులు కోరారు.

## అక్షయపాత్ర ఫౌండేషన్‌తో ఫడెక్స్ అనుబంధం

**ప్రజాపక్షం/దుండిగల్:** లాజిస్టిక్స్ మరియు డెలివరీ సేవలలో ప్రపంచ అగ్రగామి అయిన ఫడెక్స్, భారతదేశంలోని పాఠశాల పిల్లలకు పోషకాహార భోజనం అందించడానికి అంకితమైన పిఎమ్ పోషణ పథకం అమలు చేసే భాగస్వామి అయిన, అక్షయ పాత్ర ఫౌండేషన్ తో తన అనుబంధాన్ని గర్వంగా ప్రకటిస్తోందనీ,ఈసహకారంద్వారా ఫడెక్స్, సంఘాలు మరియు పర్యావరణంపై సానుకూల ప్రభావాన్ని చూపే లక్ష్యంతో సామాజిక బాధ్యత మరియు స్థిరమైన అభివృద్ధికి తన నిబద్ధతను నొక్కి చెప్తోందనీ ఫడెక్స్ ఏడు విద్యుత్ వాహనాలను పన్వేల్, ఢిల్లీ మరియు నర్సింగ్ లోని అక్షయ పాత్ర ఫౌండేషన్ కు విరాళంగా అందించడం జరిగిందని, ఇంధఆధారిత వాహనాలను విద్యుత్ వాహనాలగా మార్చడం వల్ల భోజన పంపిణీ ప్రక్రియ యొక్క సామర్థ్యాన్ని పెంచడం అదే సమయంలో పిల్లలకు ఆహారం మరియు సాధికారత కల్పించే తమ ప్రధాన కర్తవ్యానికి అధిక వనరులను కేటాయించడానికి ఫౌండేషన్ ను అనుమతిస్తూ, వాహన కాలుష్యాన్నితగ్గిస్తుందనీ,అదనంగా, ఫడెక్స్5,50,000మంది పిల్లలకు మధ్యాహ్న భోజనానికి మద్దతు ఇస్తుందని ఫడెక్స్, అక్షయ పాత్ర ఫౌండేషన్ కలిసి మధ్యాహ్న భోజన పంపిణీ మరియు పరిపాలనాప్రయోజనాలకోసం, ముఖ్య ంగా మధ్యాహ్నభోజన కార్యక్రమానికి సంబంధించిన అనుకూల ప్రయత్నాల కోసం విద్యుత్ వాహనాలను (ఈవిలు) ప్రవేశ పెట్టాయి. 2022లో, పన్వేల్ లో సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేయడం, బళ్లారిలోవిద్యుత్‌బైక్‌లపంపిణీ, ఢిల్లీ, ముంబై, బెంగళూరు అంతటా పాఠశాల విద్యార్థులకు137,602 మధ్యాహ్న భోజ నాన్ని అందించడం వంటి వివిధ స్థిరమైన ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వడానికి ఫడెక్స్ ది అక్షయ పాత్ర ఫౌండేషన్ తో జత కట్టిందని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

# పాత్రికేయ కుటుంబాలను ఆదుకోవాలి

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కొడంగల్ విలేకరులు

**ప్రజాపక్షం / కొడంగల్ :** పత్రిక రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కొడంగల్ నియోజకవర్గ విలేకరులు కోరారు. శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల అకాల మరణం చెందిన బోంరాస్‌పేట మండల ఈనాడు పాత్రికేయుడు ఉప్పరి వెంకటయ్య కుటుంబాన్ని అదుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. సుదీర్ఘకాలంగా పని చేసిన వెంకటయ్య కుటుంబం దయనీయ స్థితిలో ఉందన్నారు. వెంకటయ్యకు భార్య ఇద్దరు కూతుర్లు ఉండటంతో సహాయ సహకారాలు అందించాలని కోరారు. అదేవిధంగా భవిష్యత్తులో జర్నలిస్టులకు బరోసా కల్పించేందుకు కృషి చేయాలని విన్నవించారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా



స్పందిస్తూ జర్నలిస్టుల సేవలు అమోఘమని వారు చేస్తున్న సేవలను గుర్తు చేస్తు అన్ని రకాలుగా అదుకుంటామని బరోసా కల్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డిని బషిర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో కలిసి జర్నలిస్టులు పడుతున్న కష్టలను సమస్యలను తెలిపారు. జర్నలిస్టులకు బరోసాకల్పించేందుకు పలు అంశాలను విన్నవించగా ఎన్నికల కోడ్ తోలగిన తరువాత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. వీరిని కలిసినవారిలో టీయుడబ్ల్యుజే(ఐజేయు) రాష్ట్ర నాయకులు శ్రీకిషన్‌రావు, అర్గె అనంతప్రసాద్, శ్రీనివాస్, కానుకుర్తి రమేష్, పృథ్వీరాజ్, చామంతి ప్రభాకర్, కత్తి ప్రభాకర్, పకిరప్ప, బోంకూర్ నరేష్‌కుమార్, అవుల శ్రీకాంత్, నరేందర్, రాకేష్, బోంరాస్‌పేట విలేకరులు అంజిలయ్య, నర్సిములు, అంజిలప్ప, శ్రీశైలం, రాఘవేందర్‌యాదవ్‌లతో పాటు తదితరులున్నారు.

# అడ్డగోలుగా మట్టి తవ్వకాలు.. ప్రభుత్వ భూములే టార్గెట్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలంలో యధేచ్ఛగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, కేశ్వాపూర్, అద్రాస్‌పల్లి, లింగాపూర్‌తాండ, ఉద్దెమర్రి, ఎల్లగూడెం తదితర గ్రామాల్లో అక్రమార్కులు ఏలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి రాత్రికి రాత్రే నగరానికి తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. మట్టి తవ్వకాలు జరుపాలంటే సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అధికారుల ఆదేశాలను బేఖాతార్ చేస్తూ ప్రభుత్వ నిబంధనలను సైతం పట్టించుకోకుండా అక్రమార్కులు



ప్రభుత్వ భూములను టార్గెట్ చేసి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ప్రభుత్వ భూములైతే అడిగేవారు ఉండరని రాత్రిపూట జేసిబిలతో టిప్పర్‌లతో మట్టిని తరలిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు సైతం దిగుతున్నారని ప్రజలు వాపోతున్నారు. నిర్మాణ రంగలో మట్టి పాత్ర కీలకం కావడంతో గ్రామాల్లోని అమాయక రైతులకు డబ్బులు ఎరచూపి మట్టిని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు ఎంతో కొంత చెల్లించి దళారులు మాత్రం ట్రిప్పుకు రూ.5వేల చొప్పున అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వ భూములు అంతరించిపోతున్నాయని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పోడుస్తూ దళారులు తమ దందాను మూడు పూవులు ఆరు కాయలు అన్నచందంగా సాగిస్తు ధనార్జనే ద్యేయంగా ముందుకు సాగుతున్నారు.

**మట్టిని తరలిస్తే కఠిన చర్యలు**

**తహాశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి**

కాగా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో గురువారం అర్ధరాత్రి రెండు టిప్పర్‌ల ద్వార మట్టిని తరలిస్తుంగా రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రెండు టిప్పర్‌లను రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. తహాశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఏలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రెండు టిప్పర్‌లు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు అనే విషయంపై విచారణ చేస్తున్నామని ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## సమస్యలు పరిష్కరించండి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని కస్తూరిబాయి నగర్ కాలనీలో తామెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ కాలనీవాసులు శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డిని కల్సి విన్నవించారు. కాలనీకి చెందిన సంజీవరావు, కృష్ణ, సత్యనారాయణ, మాధవి, సువర్ణలు ఆయనతో మాట్లాడుతూ కాలనీలోని పోచమ్మ దేవాలయం సమీపంలో వంగి పోయిన విద్యుత్ స్థంభాన్ని మార్చాలని, దీని వల్ల ఎప్పుడు అది కూలి ప్రమాదం ఏర్పడుతుందోనన్న భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, వర్షాల కారణంగా గుంతల మయంగా మారిన రోడ్ల మరమ్మత్తులు చేయాలని కోరారు. ఎమ్మెల్యే దీనికి సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తానన్నారు.

## పోతులూరి వీరబ్రహ్మేంద్ర ఆరాధనోత్సవం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331 ఆరాధన దినోత్సవం సందర్భంగా కాప్రా మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని చౌరస్తాలో ఆయన విగ్రహానికి ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి పాల్గొని పూలమాలలు వేసి ఆరాధనలో పాల్గొన్నారు.కార్పొరేటర్ ప్రభుదాస్,మాజీ కార్పొరేటర్ జి శ్రీనివాస్‌రెడ్డి,సభ్యులు లక్ష్మి నారాయణచారి,పూసల బ్రహ్మచారి,సత్యనారాయణచారి, కెఆంజనేయులు, మల్లిఖార్జున్‌చారి, మురళిచారి, రాంప్రదీప్, ప్రభాకర్, నాయకులు వసంతరావు,మల్లేష్‌గౌడ్,నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 26న ఇసీనగర్‌లో టెలిఫిలిం ప్రదర్శన




**ప్రజాపక్షం/చర్లపల్లి:** డాక్టర్ పద్మభూషణ్ ఏఎస్ రావు టెలి ఫిలిం ను చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇసీ నగర్ వెంకళ జయప్రదదేవి కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 26వ తేదీ సాయంత్రం ప్రదర్శించబడుతుందని ఇసీ నగర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఏవిఎస్ వర్మ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరవుతారని ఆహ్వానితులుగా విజ్ఞానవేదిక అధ్యక్షులు యాదగిరిరావు,ప్రధాన కార్యదర్శి పిబి చారి టెలిఫిలిం దర్శకులు రఘురామచంద్ర,ప్రొడ్యూసర్ సత్యనారాయణ,ఏఎస్ రావు అవార్డు కౌన్సిల్ సెక్రెటరీ రామరాజులు పాల్గొనున్నారని ఆయన తెలిపారు.

## భగవద్గీతతో జ్ఞానోదయం



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బౌరంపేట ఇందిరమ్మ కాలనీ కార్యక్రమ నిర్వాహకులు గుడ్ల జగదీశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల శిబిర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ నాయకులు పిసరి కృష్ణారెడ్డి హాజరయ్యారు. అనంతరం బాల బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ భగవద్గీత కేవలం ఈ వారం రోజులకు పరిమితం కాకుండా ప్రతి నిత్యం రోజూ కనీసం ఒక గంట సమయం ఇచ్చి పటించడం వలన జ్ఞానోదయంతో పాటు మానసిక ఉల్లాసం మనో వికాసం కలిగి సమాజంతో ఎలా మెలగాలి ఎంతటి కష్టనైనా ఎంతటి సంతోషానైనా తట్టుకొని ఎలా బ్రతకాలి అని నేర్పిస్తుందనీ తల్లిదండ్రుల పట్ల ప్రేమ ఇరుగు పొరుగు సమాజం ఇతరుల పట్ల అభిమానం గౌరవం చూపెట్టాలని వారికి అవగాహనా కల్పించారు. అనంతరం కాలనీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ల జగదీశ్, ఆంజనేయులు చారి, నరసింహ బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం



**ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రామయ్యగూడ రోడ్డులోని నాగలక్ష్మి హర్డ్‌వేర్ ప్రమాదవశాత్తు తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి పూర్తి గా కాలిపోయింది. ఒక్కసారిగా పెత్తున మంటలు చెలరెగడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అర్పే ప్రయత్నం చేయడం జరిగింది. అప్పటికే బిల్డింగ్ మొత్తం మంటలు పోగ వ్యాపించాయి. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబాన్ని ఫైర్ సిబ్బంది అతికష్టం మీద కాపాడారు. ఫైర్ సిబ్బందితో పాటు మున్సిపల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్ల ,జెసిబితో మున్సిపల్ సిబ్బందితో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ప్రమదంలో 2కోట్ల ఆస్తి నష్టం జరిగింది అని తెలిపారు. కాంగ్రెస్ పట్టణఅధ్యక్షులు సుధాకర్‌రెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ ,స్పీకర్ దృష్టికి తీసుకేల్లారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, సుధాకర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. సంఘటన జరిగిన వెంటనే సిఐ నాగరాజు తన సిబ్బందితో పాటు ఫైర్ మున్సిపల్ సిబ్బంది ,4గంటలు కష్టపడి మంటలను అదుపులోకి తీసుకోచ్చారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని పోలీస్‌లు తెలిపారు.

## నేడు తాండూరులో విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు నియోజకవర్గంలో శనివారం విద్యుత్ అంతరాయం విధిస్తున్నట్లు తాండూరు విద్యుత్ శాఖ డిఈ భానుకుమార్ వెల్లడించారు. శనివారం తాండూరు నియోజవర్గంలోని యాలాల మండలంతో పాటు దారూర్ మండలంలోని రాఘవపూర్, బాగాయిపల్లి, నాగారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని డిఈ భానుకుమార్ తెలిపారు. శనివారం ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విద్యుత్ అంతారాయం ఉంటుందని తెలిపారు.

# క్రీడ




### ముంబై ఇండియన్స్

### కొంపముంచిన సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా

## ఆఖరి మ్యాచ్‌లోనూ ఓటమి!

ఐపీఎల్ 2024 సీజన్‌ను ముంబై ఇండియన్స్ ఓటమితో ముగించింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో వాంఖడే వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ముంబై ఇండియన్స్ 18 పరుగుల తేడాతో చిత్తయ్యింది. స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్(0), హార్దిక్ పాండ్యా(16) దారుణ వైఫల్యం ముంబై ఇండియన్స్ కొంపముంచింది. ఈ ఇద్దరూ బాధ్యతాయుతంగా రాణించి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(41 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలతో 55), నికోలస్ పూరన్(29 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సలతో 75) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. ఆయుష్ బదోని(10 బంతుల్లో ఫోర్, 2 సిక్సలతో 22 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. ముంబై బౌలర్లలో నువాన్ తుషారా(3/28), పియూష్ చావ్లా(3/29) మూడేసి వికెట్లు తీసారు.అనంతరం లక్ష్యచేధనకు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులకే పరిమితమైంది. ఇంపాక్ట్ ప్లేయర్ రోహిత్ శర్మ(38 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సలతో 68), నమన్ ధిర్(26 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 56 నాటౌట్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు.

## డూ ఆర్ డై మ్యాచ్‌కు ఆర్‌సిబి సిద్ధం



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు డూ ఆర్ డై మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. సొంతమైదానంలో చిన్నస్వామి స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో శనివారం తలపడనుంది. ప్లేఆఫ్స్‌కు చేరాలంటే రేపటి పోరులో ఆర్సీబీ తప్పక విజయం సాధించాలి. తదుపరి దశకు చేరాలంటే సాధారణంగా గెలిస్తే లెక్క సరిపోదు, సీఎస్కే నెట్ రన్ రేటును అధిగమించేలా విజయ ఢంకా మోగించాలి. కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. ఇక మిగిలిన ఒక్క బెర్తు కోసం ఆర్సీబీ, సీఎస్కే పోటీపడుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇరు జట్లు 13 మ్యాచ్‌లు ఆడగా చెన్నై సూపర్ కింగ్స్ (14 పాయింట్లు, +0.528) నాలుగో స్థానంలో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (12 పాయింట్లు, +0.387) ఆరో స్థానంలో ఉన్నాయి. సీఎస్కే నెట్ రన్ రేటును అధిగమించాలంటే రేపటి పోరులో ఆర్సీబీ కనీసం 18 పరుగుల తేడాతో విజయం సాధించాలి. ఒకవేళ ఛేదన అయితే 11 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని అందుకోవాలి. ఈ తరహాలో నెగ్గడం కోసం ఆర్సీబీ జట్టు మానసికంగా, శారీరకంగా సాధన చేస్తోంది. అయితే బెంగళూరు నగరంలో శనివారం వర్షం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రేపు సాయంత్రం వర్షం పడే అవకాశాలు దాదాపు 84% ఉన్నాయి. మేఘావృతమైన ప్రాంతంలో ఉరుములతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇది ఆర్సీబీ అభిమానులకు చేదు వార్తనే. ఎందుకంటే ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దు అయితే, ఇరు జట్లకు చెరో పాయింట్లు లభిస్తుంది. అప్పుడు బెంగళూరు జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. మరోవైపు సీఎస్కే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. అయితే ఆర్సీబీ అభిమానులకు గుడ్ న్యూస్ ఏంటంటే.. చిన్నస్వామి స్టేడియంలో అత్యుత్తమ సబ్‌ఎయిర్ డ్రైనేజ్, ఏరేషన్ సిస్టమ్ ఉన్నాయి. దీంతో వరుణుడు కాస్త కరుణించినా మైదానాన్ని చకచక మ్యాచ్‌కు సిద్ధం చేయొచ్చు. అంతేగాక రాత్రి 11 గంటల వరకు గ్రౌండ్ సిద్ధమైనా అయిదు ఓవర్ల పాటు మ్యాచ్‌ను నిర్వహిస్తారు. దీంతో మ్యాచ్ ఫలితాన్ని తేల్చవచ్చు.

## విరాట్ కోహ్లీని కలిసిన పివి సింధు



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని భారత బ్యాడ్మింటన్ స్టార్, తెలుగు తేజం పీవీ సింధు కలిసింది. ఆర్‌సీబీ టీమ్ బస చేసిన హోటల్‌కు వెళ్లిన సింధు.. విరాట్ కోహ్లీతో కలిసి సరదాగా ముచ్చటించింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అయితే విరాట్ కోహ్లీని పీవీ సింధు కలవడానికి గల కారణం ఏంటా? అనేది తెలియరాలేదు. కానీ సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలోనే పీవీ సింధు పెళ్లి పీటలు ఎక్కబోతుందని, కోహ్లీని ఆహ్వానించేందుకే అక్కడకు వెళ్లిందని కొందరు అభిమానులు కామెంట్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే కీలక మ్యాచ్‌లో సత్తా చాటాలని విరాట్ కోహ్లీకి విషెస్ చెప్పేందుకు వచ్చిందని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు. ఐపీఎల్ 2024 సీజన్‌లో ఆర్‌సీబీ ప్లే ఆఫ్స్ చేరాలంటే చెన్నై సూపర్ కింగ్స్‌తో శనివారం జరిగే మ్యాచ్‌లో తప్పక గెలవాలి. విజయం సాధించడమే కాకుండా రన్ రేట్ మెరుగుపరుచుకోవాలి. అప్పుడే సీఎస్‌కేను వెనక్కునెట్టి ప్లే ఆఫ్స్ చేరుతోంది. సీఎస్‌కే 201 పరుగుల లక్ష్యాన్ని విధిస్తే 18.1 ఓవర్లలోనే ఛేధించాలి. ఆర్‌సీబీ ముందుగా బ్యాటింగ్ చేసి 200 పరుగులు చేస్తే 18 పరుగుల తేడాతో విజయం సాధించాలి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉంది.



## తారక్, నీల్ సినిమాకి క్రేజీ టైటిల్

ప్రస్తుతం పాన్ ఇండియా మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కిస్తున్న భారీ చిత్రం దేవర కోసం అందరికీ తెలిసిందే. భారీ హైప్ ఉన్న ఈ సినిమా నుంచి ఈ 19మే న అవైటెడ్ ఫస్ట్ సింగిల్ రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత తారక్ కి ఉన్న సాలిడ్ లైనప్‌లో సెన్సేషనల్ మాస్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో చేయనున్న సినిమా కూడా ఒకటి. దీనిపై ఓ రేంజ్ లో అంచనాలు నెలకొనగా ఓ క్రేజీ బజ్ ఇప్పుడు వైరల్‌గా వినిపిస్తుంది. దీని ప్రకారం ఈ చిత్రానికి డ్రాగన్ అనే ఆసక్తికర మరియు పవర్‌ఫుల్ టైటిల్‌ని లాక్ చేసినట్టుగా ఇప్పుడు వినిపిస్తుంది. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇపుడు ప్రశాంత్ నీల్ సలార్ 2తో బిజీగా ఉండగా ఎన్టీఆర్ వార్ 2తో బిజీగా ఉన్నాడు. ఇవి పూర్తయ్యాక వీరి డ్రాగన్ మొదలు కానుంది. ఇక ఈ భారీ చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించనుండగా ఈ ఏడాది అక్టోబర్ లేదా నవంబర్ నుంచి సినిమా షూటింగ్ మొదలు కానుంది.

# రీల్

## పవన్ ఓజి మొదలయ్యేది అప్పుడే

రానున్న రోజుల్లో మన టాలీవుడ్ నుంచి అంతా ఎదురు చూస్తున్న పలు క్రేజీ ప్రాజెక్టలలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అలాగే యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో చేస్తున్న పవర్ఫుల్ యాక్షన్ చిత్రం ఓజి కూడా ఒకటి. పవన్ కెరీర్‌లో సాలిడ్ హైప్‌ని తెచ్చుకున్న ఈ చిత్రం ఇప్పుడు పవన్ ఎన్నికల మూలాన ఇచ్చిన గ్యాప్‌లో నిరవధికంగా కొన్నాళ్ల పాటు ఆగాల్సి వచ్చింది. అయితే మళ్ళీ ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండగా దీనిపై లేటెస్ట్ బజ్ ఒకటి వినిపిస్తుంది. దీని ప్రకారం ఈ చిత్రం ఇది వరకు మేము చెప్పినట్టుగానే ఆలస్యంగానే మొదలు కానుందట. జూన్ నెలాఖరు అలా పవన్ డేట్స్ ఇచ్చినట్టుగా ఇప్పుడు వినిపిస్తుంది. దీనితో ఎన్నికలు పూర్తయ్యి ఫలితాలు వచ్చిన తర్వాతే ఓజి మళ్ళీ రీస్టార్ట్ కానుంది అని చెప్పాలి. అయితే ఈ సినిమాకి ఇంకా పవన్ కేవలం 15 రోజులు అలా మాత్రమే పని చేయాల్సి ఉందని టాక్. ఈ డేట్స్ కోసమే మేకర్స్ ఎప్పుడు నుంచో ఎదురు చూస్తున్నారు. మొత్తానికి అయితే ఇది జూన్, జూలై నాటికి సాధ్యపడనుంది అని చెప్పవచ్చు. ఇక ఈ భారీ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ సెప్టెంబర్ 27న గ్రాండ్‌గా పాన్ ఇండియా లెవెల్లో సినిమా రిలీజ్ కాబోతుంది.



## ప్రభాస్ పోస్ట్ ఈ హీరోయిన్‌తో లింకప్ యాదృచ్ఛికమేనా



తాజాగా పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ పోస్ట్ చేసిన ఇన్స్టాగ్రామ్ స్టోరీ అభిమానుల్లో ఎలాంటి హీట్ ని జెనరేట్ చేసి పారేసిందో చూసాం. దీనితో అసలు ప్రభాస్ ఎవరి కోసం దేని కోసం చెప్పాలి అనుకున్నాడో అని ఆసక్తి మొదలైంది. ఇక ఇంకో పక్క ఓ ప్రత్యేకమైన వ్యక్తిని పరిచయం చేయబోతున్నాను అని హింట్ ఇవ్వడంతో ప్రభాస్ తన లైఫ్ పార్ట్నర్ కోసం కానీ అనౌన్స్ చేయబోతున్నాడా అనే ఉత్సుకత కూడా మరోపక్క మొదలైంది. మరి ఇప్పుడు ఇదే పోస్ట్ తో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ రీసెంట్ గా మంగళవారం చిత్రంతో మెప్పించిన నటి పాయల్ రాజ్‌పుత్ ఇవాళ ఉదయం పన్నెండున్నర సమయంలో పెట్టిన పోస్ట్ తో సంబంధం ఉన్నట్టుగా వైరల్ గా మారింది. ప్రభాస్ ఏమో డార్లింగ్స్ అంటూ పోస్ట్ స్టార్ట్ చేసాడు అలాగే పాయల్ ఏమో నేను ఖచ్చితంగా ఎవరొకరి డార్లింగ్ అవుతాను ఏమన్నా గెస్ చేస్తారా అంటూ పోస్ట్ చేసింది. కామన్ గా డార్లింగ్ అనే పాయింట్ రావడం ఆ పోస్ట్ కి ఈ పోస్ట్ కి ఎక్కడో పొంతన కుదురుతుంది అనేది వైరల్ గా మారింది. దీనితో అభిమానుల్లో మరింత టెన్షన్ మొదలైంది. మరి ఈ ఇద్దరి పోస్ట్ లు కేవలం యాదృచ్ఛికమేనా లేక ఏదన్నా సినిమా సంబంధించి ప్రమోషన్ లాంటిది ప్లాన్ చేసారా అనేది కొంచెం ఆగి చూస్తే తెలుస్తుంది.



## ఒరిస్సాలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విస్తృత ప్రచారం

ప్రజాపక్షం/హైదరాబాద్:లోక్‌సభ ఐదో విడత ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ఒరిస్సా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గత మంగళవారం రాత్రి ఆయన నేరుగా ఢిల్లీకి వెళ్లారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి రాహుల్ గాంధీతో ప్రత్యేక విమానంలో ఒరిస్సాలోని బోలాంగిరి పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన రాహుల్ గాంధీతో కలిసి పాల్గొన్నారు. అదేరోజు రాహుల్ గాంధీతో కలిసి ఆయన నేరుగా ఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం తిరిగి ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ కు చేరుకుని స్థానిక పిసిసి నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా నిర్వాహకులతో ఎన్నికల్లో గెలుపు కోసం వ్యవహరించాల్సిన వ్యూహాలను చర్చించారు.ఆయన బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులపాటు ఒరిస్సా రాష్ట్రంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

## రోడ్డు ప్రమాద నివారణకు చర్యలు

ప్రజాపక్షం / హైదరాబాద్ : హైదరాబాద్ నుంచి విజయవాడ రహదారిలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై, హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు, భద్రతపై మంత్రి సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర, జాతీయ రహదారుల అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ఎన్‌హెచ్ 65 రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణాలను, బ్లాక్ స్పాట్స్ ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల్లో పాటించాల్సిన రహదారి భద్రతా చర్యలు గురించి సమీక్ష నిర్వహించారు. పలు ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాల్లో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, సైన్ బోర్డ్స్, హెవీ స్పీడ్ నివారణ, కొన్నిచోట్ల ఆరు లేన్లుగా రోడ్డు నిర్మాణం చేయడం వంటి చర్యలతో బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైవేలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న 17 బ్లాక్ స్పాట్ ప్రాంతాలను అధికారులు తెలిపారు. చౌటుప్పల్, పెదకాపర్తి, చిట్యాల, కట్టంగూర్, ఇనుపాముల, టేకుమట్ల, జనగామ క్రాస్ రోడ్స్, ఈనాడు జంక్షన్, దురాజ్‌పల్లి జంక్షన్, ముకుందాపురం, అకుపాముల, కోమరబండ క్రాస్ రోడ్స్, కటకం గూడెం, మేళ్ల చెరువు, శ్రీరంగాపురం, రామాపురం క్రాస్ రోడ్స్, నవాబ్ పేట జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు వివరించారు. రహదారిపై కొన్నిచోట్ల ఆరులేన్ల నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధి, అండర్ పాస్‌లు, సర్వీసు రోడ్ల నిర్మాణం వంటి ప్రణాళికలు చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో ఆర్అండ్‌బి ఈఎన్‌సి గణపతిరెడ్డి, జాతీయ రహదాహదారుల ప్రాంతీయ అధికారి రజాక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడిపై మోజుతో భర్తను కడతేర్చిన ఇల్లాలు

### పైగా ఏమీ ఎరగనట్లు గుండెపోటని చెప్పి అందరినీ నమ్మించి..

### దహన సంస్కరాలు కూడా పూర్తి చేశారు

### నిందితుడు లొంగిపోవడంతో వెలుగులోకి హత్య కేసు




ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రియుడి మోజులో పడిన ఓ భార్య కట్టుకున్న భార్యను చంపించింది. గుండెపోటుతో చనిపోయాడని బంధువులను నమ్మించి దహన సంస్కరాలు కూడా పూర్తి చేసింది. ఇది జరిగిన మూడు నెలల తర్వాత నిందితుల్లో ఒకడు పోలీసుల ఎదుట లొంగిపోవడంతో హత్య ఉదంతం మధురానగర్ ఇన్‌స్పెక్టర్ డి.మధుసూదన్‌రెడ్డి తెలిపిన కథ నం ప్రకారం..ఎల్లారెడ్డిగూడ జయప్రకాశ్నగర్లోని శిఖర అపార్ట్మెంట్స్లో విజయ్కుమార్ (40), శ్రీలక్ష్మి (33) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికిద్దరు పిల్లలు (9, 8 యేళ్లు). ఈ క్రమంలో శ్రీలక్ష్మికి బోరబండకు చెందిన రాజేశ్ (30) అనే వ్యక్తితో వివాహేతర ఏర్పడింది. విజయ్‌కుమార్, శ్రీలక్ష్మిల వివాహానికి ముందే వీరిద్దరు ప్రేమికులు. వీరి సంబంధాన్ని పెళ్లి అయిన తర్వాత కూడా భర్తకు తెలియకుండా కొనసాగించారు. ఎప్పటికైనా భర్తకు తెలిస్తే ఇబ్బందేనని, అడ్డుగా ఉన్న భర్తను చంపించాలని భావించిన శ్రీలక్ష్మి భర్త విజయ్‌కుమార్ (40) అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. అంతేకాకుండా భర్త పేరిట మేడ్చల్, ఎల్లారెడ్డిగూడలో సొంత ఇళ్లు కూడా ఉన్నాయి. భర్తను చంపి, ఆస్తి అమ్ముకొని ఆ డబ్బుతో ఎంజాయ్ చేద్దామని ప్లాన్ వేసింది. ఈ విషయం రాజేశ్తో చెప్పడంతో సరేనన్నాడు. ఇందుకు రాజేశ్ సనత్‌నగర్‌కు చెందిన పటోళ్ల రాజేశ్వర్ రెడ్డి (40) అనే రౌడీషీటర్ సాయం కోరాడు. రాజేశ్వర్రెడ్డిపై ఇప్పటికే పలు స్టేషన్లలో 8 కేసులున్నాయి. ఎల్లారెడ్డిగూడలో ఉంటున్న ఇల్లు వాస్తు బాగోలేదని చెప్పి, శిఖర అపార్టమెంట్కు మకాం మార్పించి కుట్రకుతెరలేపింది భార్య. భర్త హత్యకు రాజేశ్వర్‌రెడ్డి, మహ్మద్ మైతాబ్ అలి యాస్ బబ్బున్కు భారీగా సుపారీ అందజేసింది.పథకం ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి 1న విజయ్‌కుమార్ తన పిల్లల్ని స్కూలులో దింపేందుకు వెళ్లాడు. అనంతరం రాజేశ్, రాజేశ్వర్‌రెడ్డి, మైతాబ్ను శ్రీలక్ష్మి ఇంటికి పిలిపించి బాత్రూంలో దాచింది. పిల్లల్ని దింపి విజయ్ ఇంటికి రాగానే శ్రీలక్ష్మి లోపలి నుంచి గడియపెట్టింది. అనంతరం బాత్రూం గడియ తీయడంతో వారంతా బయటకు వచ్చి డంబెల్లు, ఇనుపరాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తనను చంపొద్దని వేడుకుంటు న్నా కనికరించని ఆ ముగ్గురూ అతన్ని చం పి, బాత్రూంలో పడేసి వెళ్లిపోయారు. ఇం ట్లో రక్తపు మరకలను శుభ్రంగా తుడిచేసి, భర్త శవానికి దుస్తులు మార్చి, గుండెపోటు వచ్చి, తల గోడకు తగిలి భర్త మరణించాడని ఏడుపులంకించుకుంది. నిజమేనని నమ్మిన కుటుంబ సభ్యులు, బంధువులు అదే రోజు శ్రీనగర్ కాలనీ శ్మశానవాటికలో విజయ్ దహన సంస్కారాలు పూర్తి చేశా రు. నిజానికి మృతుడి కుటుంబ ఆచారాల ప్రకారం పూడ్చిపెట్టి అంత్యక్రియలు చే యాల్సి ఉండగా ఆధారాలు లభించ కుం డా భార్య దహనం చేయించింది.ఇంతలో ఏం జరిగిందో తెలియదుగానీ విజయ్ హత్య అనంతరం వికారాబాద్ పారిపోయిన రాజేశ్వర్రెడ్డిలో పశ్చాతాపం మొదలైంది. విజయ్ను కొడుతుండగా సందర్భంలో తనను చంపొద్దని అతను చేసిన ఆర్తనాధాలు గుర్తుకొచ్చి పశ్చాత్తాపంతో కుంగిపోయాడు. మనఃశాంతి కరువైన రాజేశ్వర్రెడ్డి మధురానగర్ ఠాణాకు వచ్చి నేరం అంగీకరించాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడు ఇచ్చిన సమాచారం మేరకు రాజేశ్వర్రెడ్డితోపాటు శ్రీలక్ష్మి , రాజేశ్, మైతాబ్లను కూడా అరెస్ట్ చేశారు. హత్యతోపాటు ఆధారాలు మాయం చేసినందుకు 302, 201 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో అటు తండ్రి మరణం, ఇటు తల్లి అరెస్టో పిల్లలిద్దరూ అనాథలయ్యారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: వేతనాల పెంపు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రెండవ పిఆర్‌సి ఛైర్మన్ శివ శంకర్‌ను పలువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని , హెల్త్‌కార్డులకు పరిమితులు విధించకుండా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు జరిగేలా చూడాలని పలు ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు పిఆర్‌సి ఛైర్మన్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా తెలంగాణ స్టేట్ సెక్రెటరియేట్ అసోసియేషన్ (టిఎస్‌ఎస్ఎ) అధ్యక్షుడు ఎన్.సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జె.దేవేందర్ , ఉపాధ్యక్షురాలు బి.రాజేశ్వరి, అదనపు కార్యదర్శి ఎం.సుజీత్ కుమార్, సంయుక్త కార్యదర్శులు శివాజితౌటమ్,కె.స్వామి, కోశాధికారి డి.వంశీధర్ రెడ్డి, ప్రతినిధి ఎస్.కిశోర్ తదితరులు పిఆర్‌సి ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హెచ్‌ఆర్‌ఎను పెంచాలని, హెల్త్‌కార్డుకు పరిమితి విధించకుండా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు జరిగేలా చూడాలని వారు కోరారు. అసిస్టెంట్ సెక్రెటరీలకు వాహన సదుపాయాలను కల్పించాలని, వారంలో ఐదు రోజుల పని దినాన్ని, డాటా ఎంట్రీ ఆపరేటర్ల వేతనాలను కూడా పెంచాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు ఇవ్వాలని, మెట్రో ట్రేన్ పాస్‌లను కూడా ఇవ్వాలని కోరారు.

## తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా



ప్రజాపక్షం/హైదరాబాద్ : తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖలపై శుక్రవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఇంజనీర్ఇన్‌చీఫ్ కార్యాలయంలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానీయా మాట్లాడుతూ ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తాగు నీటి సరఫరా మిషన్ భగీరథ ఇంజనీర్ల బాధ్యత అన్నారు. పైప్‌లైన్‌లు లీకైనా, పగిలినా వెంటనే వాటిని అదే రోజు పునరిద్ధరించాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి రోజు ప్రమాణాలకు అనుగుణంగా తాగు నీటి సరఫరా చేయాలన్నారు. ఈ విషయంలో మిషన్ భగీరథ ఇంజనీర్లు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రతీరోజు, గ్రామాలలోని ఓవర్ హెడ్ ట్యాంకులలో క్లోరినేషన్ చేయడంలో పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. తాగు నీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించాని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిషన్ భగీరథ సరఫరాతో పాటు గ్రామాలలో ఇప్పటికే ఉన్న చేతి పంపులు, సింగిల్ ఫేజ్ మోటార్లు, స్కీమ్ బోర్లు తదితర గ్రామ మౌలిక సదుపాయాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. అత్యవసరమైన పరిస్థితులలో ఈ స్థానిక వనరులను ఉపయోగించి, తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి, తాగు నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. మండల స్థాయి మిషన్ భగీరథ ఇంజనీర్లు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డితో పాటు ఇతర మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## బిజెపి మళ్లీ వస్తే రాజ్యాంగానికి పాతర



ప్రజాపక్షం/హైదరాబాద్: బిజెపిని మూడోసారి గెలిపిస్తే రాజ్యాంగం అంతమయ్యే ప్రమాదం ఉన్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి ఓటు వేస్తే ' కూర్చున్న కొమ్మను మీరే' నరుకున్నట్టుగా ఉంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహారాష్ట్ర లోని దారివి, సియాన్ కొలివాడ, బాంద్ర తదితర ప్రాంతాలలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర గడ్డకు ఒక ప్రత్యేకత ఉన్నదని, మన భారత రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బాబా సాహెబ్ భీంరావ్ అంబేద్కర్, సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే ఈ గడ్డపైనే పుట్టారని, ప్రస్తుతం మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛ, హక్కులు, రిజర్వేషన్లు ఈ గడ్డమీద పుట్టిన బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా వచ్చినవేనని వివరించారు. మహిళలకు విద్యావకాశాల కోసం పరితపించిన జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే ఆకాంక్షలకు అనుగుణంగానే తెలంగాణ రాష్ట్రంలో ఆరు నెలల క్రితం కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా భవన్‌కు 'జ్యోతిబా పూలే' పేరు పెట్టామని గుర్తు చేశారు. ఆరు దశాబ్దాల పాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను పరిరక్షించింది, తు.చ తప్పకుండా అమలు చేసిందని, సామాజిక అసమానతలను నిర్మూలించేందుకు చిత్తశుద్ధితో కృషి చేసిందని, రాచరిక ఛాయలను తొలగించిందని తెలిపారు. పదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాయాలనుకుంటున్నదని, రిజర్వేషన్లను ఎత్తి వేయాలనిచూస్తోందని విమర్శించారు. జిఎస్‌టి పేరుతో ప్రతీ వస్తువుపైన పన్ను వేసి ప్రజలనుండి ముక్కుపిండి పన్నులను వసూలు చేస్తుందని, తద్వారా సామాన్యుల బతుకులు భారంగా మారాయని తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న శివసేన, ఎన్‌సిపి ప్రజాప్రతినిధులను బిజెపి ప్రలోభాలకు గురిచేసి, లాగేసుకున్నదో అందరికీ తెలిసిందేనని గుర్తు చేశారు. ఇండియా కూటమికి ఓటు వేసి గెలిపించాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.